క్లుప్తంగా

ఆత్మస్థైర్యాన్ని పెంచే కరాటే


మాట్లాడుతున్న జెడ్పీటీసీ లక్ష్మణ్

పెద్దపల్లిరూరల్: ఆత్మరక్షణకోసం ఆత్మస్థైర్యాన్ని పెంచే కరాటే శిక్షణ పొందడం మంచిదని జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అన్నారు. పెద్దపల్లిలోని నందన గార్డెన్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీల ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కరాటే శిక్షణ ఇచ్చి పోత్సహిస్తున్న మాస్టర్లను అభినందించారు. కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆసియా, హాసిని, భానుప్రసాద్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దండె వెంకటేశ్వర్లు, కాంతయ్య, శరణ్య, మొండయ్య, భూమయ్య, వెంకటేశ్, సాయికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపీపీ దేవక్క

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ అరెల్లి దేవక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీపీ మాట్లాడుతూ రామగిరి మండలం పూర్తిగా సింగరేణి ప్రభావిత గ్రామాలతో కూడుకుందని గ్రామాల్లో ఏలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని, సీఎస్సార్ నిధుల వినియోగంపై సమాచారం ఇవ్వడం లేదన్నారు. అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్


లారీకి జరిమానా విధిస్తున్న ఎస్సై


యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11ఏ ప్రధాన చౌరస్తా వద్ద ఆదివారం టూటౌన్ పోలీసులు లారీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సందర్భంగా ఫేస్ టూ నుంచి సీహెచ్‌పీ ,బి పవర్ హౌస్ వెళ్తున్న బొగ్గు లారీలపై టార్పాలిన్ కవర్ కప్పని లారీలకు జరిమానా విధించినట్లు ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈస్పెషల్ డ్రైవ్ లో టూటౌన్ ఎస్సై కళాధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు వడ్కాపూర్‌లో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం పరామర్శించారు. ఆయా కుటుంబాలను పరామర్శించి 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, సర్పంచ్ మాంకాళి తిరుపతి, సంపత్ ,ఆంకూస్,ఎర్రోల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు


బోరుకు మోటారు బిగిస్తున్న సిబ్బంది

మంథని: మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ తెలిపారు. ఆదివారం పలు వార్డుల్లో బోర్లకు మరమ్మతులు చేపట్టారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో మూడు రోజులు అంతరాయం త లెత్తడంతో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ సూచనల మేరకు బోర్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు.

విద్యుత్ వసూళ్లపై ఏసీడీ ఎఫెక్ట్

- జనవరిలో 50% రాని బకాయిలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు
- బిల్లులు చెల్లించబోమన్న గ్రామస్తులు


సబ్ స్టేషన్

రామగుండం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అదనపు వినియోగ డిమాండ్ (ఏసీడీ) పేరుతో ఏడాదికి ఒక సారి రెగ్యులర్ కరెంట్ బిల్లుతో కలిపి వేస్తున్నారు. ఇటీవల వినియోగదారుల విద్యుత్ బిల్లుల్లో అదనంగా ఏసీడీ బకాయిలు సైతం చెల్లించాలని బిల్లులు పంపించారు. దీంతో వివిధ గ్రామాల్లో ఏసీడీ బకాయిలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాలకు విద్యుత్ బిల్లుల వసూళ్లకు వెళ్లిన సిబ్బందిని విద్యుత్ బిల్లులు చెల్లించేది లేదని పేర్కొంటూ బిల్ కలెక్టర్‌ను తిరిగి వాపసు పంపించారు. దీంతో ప్రతీ నెల ట్రాన్స్‌కోకు రావాల్సిన డిమాండ్‌లో ప్రస్తుత మాసంలో 50%శాతం కూడా వసూలు కాకపోవడం పట్ల అధికారులు ఆందోళన చెందుతున్నారు.

అసలు ఏసీడీ అంటే ఏమిటి...?

మారుతున్న సామాజిక అవసరాల నేపథ్యంలో ప్రతీ ఇంట్లో ఎలక్ట్రానిక్ పనిముట్ల అవసరాలు పెరిగిన తరుణంలో ఎప్పుడో ఏళ్ల క్రితం కిలోవాట్ సామర్థ్యం గల విద్యుత్ మీటర్లను మాత్రమే బిగించుకున్నారు. కాలక్రమేణా విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడుతుండడంతో లోఓల్టేజీ తదితర సమస్యలతో ఉపకరణాలు కాలిపోతున్నాయి. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు గృహ వినియోగదారులు తమ మీటర్ సామర్థ్యానికి మించి వాడిన విద్యుత్‌ను గుర్తించి చెల్లించాల్సిందే ఏసీడీ బకాయిగా పేర్కొంటున్నారు. ఇందుకు అదనపు విద్యుత్ వినియోగాన్ని గుర్తించి తదనుగుణంగా యూనిట్ ధర ఆధారంగా చెల్లించాల్సిన మొత్తాన్ని నిర్ధారించారు.

రామగుండంలో 65% మాత్రమే బిల్లుల వసూలు

రామగుండం ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో రావాల్సిన మొత్తం రూ.32.87 లక్షలు కాగా, ఇప్పటి వరకు కేవలం రూ.19.69 లక్షలు, ఏసీడీ మొత్తం రూ.4.74 లక్షలు వసూలైనట్లు ఏఈ బేతి దామోదర్ రావు తెలిపారు.

అంతర్గాంలో 55% వసూలు

అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో రూ.23.32 లక్షలు కాగా కేవలం రూ.12 లక్షలు, ఏసీడీ బకాయిలు రూ.ఐదు లక్షలు మాత్రమే వసూలయ్యాయి. ఏసీడీ బకాయిలు రద్దు చేసిన తర్వాతే సాధారణ బిల్లులు చెల్లిస్తామని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

మూడు వేల బిల్లు వచ్చింది



నాకు ప్రతీ నెల విద్యుత్ బిల్లు ఐదు వందలకు మించదు. ఇటీవల విద్యుత్ వినియోగం కాస్త ఎక్కువవడంతో బిల్లు రూ.906/– వచ్చింది. దీనికి అదనంగా ఏసీడీ పేరుతో రూ.2,144/– బిల్లు పంపించారు. మొత్తం రూ.3,010/– చెల్లిస్తేనే బిల్లు తీసుకుంటామని చెప్పడంతో డబ్బులు లేక చెల్లించలేదు.
– శేఖర్, వినియోగదారుడు, కుందనపల్లి

వినియోగించినంత వరకే బిల్లులు



ప్రతీ వినియోగదారుడు తమ మీటర్ విద్యుత్ సామర్థ్యానికి మించి వినియోగించినప్పుడే ఏసీడీ బకాయి పేరుతో బిల్లు వస్తుంది. కొందరికి వంద రూపాయలు బిల్లు కూడా వచ్చిన వినియోగదారులున్నారు. ఏసీడీ పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నారనేది అవాస్తవం. వినియోగించిన విద్యుత్ కే బిల్లు వసూలు చేస్తున్నాం.
– ఏ.శంకర్, ట్రాన్స్‌కో ఏఈ, అంతర్గాం

గాడి తప్పిన మున్సి‘పాలన’


భూంనగర్‌లో స్థానికులను పలకరిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో మున్సి‘పాలన’ గాడి తప్పింది...అధికారంలో ఉన్నోళ్లకు ప్రజల సమస్యలు కనిపిస్తలేవు.. వాళ్లది ఒక్కటే ఎజెండా సర్కార్ సొమ్మును.. సహజవనరులను దోచుకునుడెట్ల అన్న దేనిని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రజాప్రతినిధులపై ధ్వజమెత్తారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భూంనగర్, శ్రీరాంనగర్, సంగీత టాకీస్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో ముచ్చటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రోజురోజుకు పెరుగుతున్న పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించడం లేదన్నారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం లోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వెంట నాయకులు సునీల్‌గౌడ్, మల్లయ్య, దాసరి కిష్టయ్య, నరేశ్, ఈర్ల స్వరూప, సంపత్, శ్రీమాన్, జగదీశ్, సర్వర్, రవి, చందు, శ్రీను, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే ప్రజల్లో గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ధర్మారం: సామాజిక సేవతో ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ లింబనాద్రి రీజీయన్ మీట్ రీజీయన్ చైర్‌పర్సన్ సామ పద్మ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 11 లయన్స్‌క్లబ్‌లు 5 లీయో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులు పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనపర్చిన క్లబ్ అధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా మోటీవేటర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సేవలు మరువలేనివన్నారు. భారతదేశంలోనే అత్యుత్తమ సేవలందిస్తున్న సంస్థగా లయన్స్‌క్లబ్‌కు పేరుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మల్టీపుల్ ఫాస్ట్ రీజీయన్ కౌన్సిల్ చైర్మన్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఉప గవర్నర్లు ముద్దసాని ప్రమోద్‌కుమార్, విజయలక్ష్మి, చిదుర సురేశ్, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, జోన్ చైర్మన్లు తన్నీరు రాజేందర్, శ్యాంసుందర్‌రెడ్డి, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు


రేకుర్తికి తీసుకెళ్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడానికి ఆదివారం రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. గోదావరిఖని లయన్స్ క్లబ్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును నగరపాలక మేయర్ అనిల్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలున్న నిరుపేదలకు ఉచితంగా పరీక్షలు చేయించడంతోపాటు వారికి రేకుర్తిలో ఉచిత ఆపరేషన్లు చేయిడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, సీనియర్ సభ్యులు బేణిగోపాల్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటీ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కరీంనగర్ సన్‌షైన్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకే అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సన్‌షైన్ ఆస్పత్రి నిర్వాహకులు, పెద్దపల్లికి చెందిన డాక్టర్ గుప్తా లాంటివారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచిత సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో 1056 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించామని ఆస్పత్రి సీఈవో సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలని సంతకాల సేకరణ


మంథనిలో సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

మంథని: బీసీల కుల గణన చేపట్టి రిజర్వేషన్లను 27 నుంచి 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ఆదివారం మంథని ప్రధాన చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు సంతకాలు సేకరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 బీసీ కులాల స్థితిగతులను అధ్యయనం చేసి రిజర్వేషన్ కల్పించేందుకు ఏర్పాటైన కమిషన్ నివేదికలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు జనగామ రవికుమార్, కందుగుల రాజన్న, నాగరాజు, ఏటా సంపత్ పాల్గొన్నారు.

బీసీ గణన చేపట్టి.. రిజర్వేషన్లను పెంచాలి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేలా చూడాలని, బీసీ జనగణన చేపట్టి, అన్ని రంగాల్లో 27 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఒక రోజు దీక్షలో ఇతర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. తమిళనాడు, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరున బీసీ రిజర్వేషన్లు పెంచాలని, బీహార్ రాష్ట్రంలో చేపట్టిన రీతిన బీసీ గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పోచం

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారి ఆరుముళ్ల పోశం అన్నారు. ఆదివారం అంతర్గాం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోశం మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని, ప్రతీ కార్యకర్త కంకణబద్ధుడై పార్టీకి పని చేయాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా విదేశాలలో మోదీ ప్రభంజనం, భారతదేశ కీర్తి తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రతీ వ్యక్తికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి బోడకుంట సుభాష్, బోడకుంట జనార్ధన్, బండిపల్లి చంద్రయ్య, గోలివాడ శ్రీనివాస్, పెద్దపల్లి గంగారాం, ఆదిమూలం నరేశ్, మాడ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సీఐటీయూ అఖిల భారత కౌన్సిల్ సభ్యుడిగా రాజారెడ్డి

గోదావరిఖని: సీఐటీయూ అఖిల భారత మహాసభలో సింగరేణి ప్రాంత వాసులకు చోటు లభించింది. యూనియన్ అఖిల భారత కౌన్సిల్ సభ్యులుగా సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు బి.మధును ఎన్నుకున్నారు. బెంగుళూరులోని శ్యామలచక్రవర్తి నగర్‌లో జరిగిన మహాసభలో వీరిని ఎన్నుకున్నారు.

గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా సతీశ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్ గీత పారిశ్రామిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొయ్యడ సతీశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా న్యాలం సంపత్, ప్రధానకార్యదర్శిగా కే.వెంకటరమణ, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకుడు వెంకటేశం, తదితరులు అభినందించారు.

స్వర్ణకార సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా శ్రీధర్

రామగుండం: పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం సహాయక కార్యదర్శిగా పట్టణానికి చెందిన బాణాల శ్రీధర్‌ను నియమిస్తూ ఆదివారం జిల్లా అధ్యక్షుడ రంగు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీధర్ నియామకంపై సుద్దాల రామస్వామి, రమేశ్, రవి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సమాచారం

నేడు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్లకు చెల్లించాల్సిన వేతనాలు, బిల్లుల తదితర సమస్యల పరిష్కారానికి సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నామని మధ్యాహ్న భోజన కార్మికుల వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ తెలిపారు. గతేడాది 68 రోజుల సమ్మె అనంతరం అసెంబ్లీలో రెండు వేల రూపాయలను పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతీ రోజు రూ.210/– చెల్లించి వంటపాత్రలను అందజేయాలని కోరారు.ధర్నాకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో కార్మికులు తరలిరావాలని కోరారు.

‘ఖని’లో బీసీ జనగణన దీక్ష

గోదావరిఖని: తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బీసీ జనగణన దీక్ష నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ తెలిపారు. ప్రధాన చౌరస్తాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్ష కొనసాగుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో మద్దతు ప్రకటించి దీక్ష విజయవంతం చేయాలని కోరారు.

నేడు కాల్వశ్రీరాంపూర్ సర్వసభ్య సమావేశం

కాల్వశ్రీరాంపూర్: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో నేడు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, ఎంపీడీవో రామ్మోహనా చారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి వివిధ అభివృద్ధి శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

24న జూలపల్లి మండల సమావేశం

జూలపల్లి: ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. సమావేశానికి పెద్దపలి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతున్నారని, సర్పంచులు, ఎంపీటీసీలు అన్ని అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

27న ముత్తారం మండల సమావేశం

ముత్తారం: ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ఆదర్శ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభం

రామగుండం: 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఆదర్శ (మోడల్) విద్యాలయంలో ఆరో తరగతి, 7–10వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. కాగా ఆరో తరగతిలో వంద సీట్లకు, 7–10వ తరగతిలో ఖాళీ అయ్యే సీట్లను భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అదుపుతప్పి డీసీఎం వ్యాన్ బోల్తా

మంథని: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలో గంగాపురి రైస్‌మిల్ మూల మలుపు వద్ద ఆదివారం డీసీఎం వ్యాన్ బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి సామగ్రి తరలిస్తుండగా ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

‘అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తే అడ్డుకుంటాం’

మంథని: మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను అనర్హులకు ఇస్తే అడ్డుకుంటామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్ అన్నారు. నేడు మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా పంపిణీ చేసే డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎల్లమ్మ గుడి నిర్మాణానికి విరాళం

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో శ్రీరేణుకా ఎల్లమ్మగుడి నిర్మాణానికి ఉపసర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు గ్యారవేని నాగరాజు రూ. 12,516లను విరాళం అందజేశారు. కార్యక్రమంలో గోపరపల్లె ఉపసర్పంచు బండి రవి, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సుల్తానాబాద్: దివంగత సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను సుల్తానాబాద్ లో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు అల్లంకి సత్యనారాయణ, మహేష్ బాబు ఫ్యాన్స్‌యువజన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన కర్రకుండ లక్ష్మికి పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల ఠాగూర్ రక్తదానం చేశారు. లక్ష్మి కాలు ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా, దాసరి ఫౌండేషన్ సభ్యుల సహకారంతో రక్తదానం చేశారు. కార్యక్రమంలో దాసరి ఫౌండేషన్ సభ్యులు సముద్రాల రాజకుమార్ గౌడ్, వెన్నం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆదివారం ఏగోలపు సదయ్య బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు.

పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు

జూలపల్లి: మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలు బాలరాజుపల్లె, కీచులాటపల్లె, కోనరావుపేట గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ప్రతి పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం 60 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంపీపీ రమాదేవి తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

శశ్మాన వాటికలో బోరు ఏర్పాటు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి ఆదర్శ నగర్‌లో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసే బోరును ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీ అబ్బిడి వినోద, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని ఆయుర్వేద ఆస్పత్రి


మూసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల

ఓదెల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి నెలరోజులుగా మూతపడింది. ఇందులో పని చేసే సిబ్బందిని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి బదిలీ చేయడంతో సిబ్బంది లేక నడవడం లేదు. ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ కమలాకుమారి, ఫార్మాసిస్టు రాచర్ల లక్ష్మణ్‌ను వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి పంపించారు. దీంతో ఏకంగా నెలరోజులుగా ఆస్పత్రి నడిపించక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఓదెల మండలంలో పొత్కపల్లి, ఓదెల గ్రామాల్లో ఆయుర్వేద ఆస్పత్రులు ఉన్నాయి. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద మందులు వాడే వార ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఆస్పత్రిలో సిబ్బందిని నియమించి మందులు పంపిణీ చేయాలని దీర్ఘకాలిక రోగులు కోరుతున్నారు.